నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 1 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మత్తు పదార్థాలతో కలిగే నష్టంపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఫిబ్రవరి 29 : మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, ఆబ్కారీ మద్యపాన నిషేధ శాఖ పర్యవేక్షకుడు నందగోపాల్‌తో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మద్యానికి,మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై నిఘా పెట్టాలని సూచించారు. మత్తు పదార్థాలు రవాణా చేసే వారికి 20 ఏళ్ల జైలు, రూ. 2 లక్షల జరిమానా, అవసరమైతే మరణ శిక్ష కూడా విధించే అవకాశముందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ప్రిన్సిపాల్ చక్రపాణి పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ

మంచిర్యాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 29 : జిల్లాలో ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని 25 సెంటర్లలో 6,664 (5,545 జనరల్, 1,119 వొకేషనల్) మంది విద్యార్థులకు 6,414 (5,332 జనరల్, 1,083 వొకేషనల్) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 250 (213 జనరల్, 37 వొకేషనల్) మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన అమలు కారణంగా ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. పలు కేంద్రాలను డీఐఈవో శైలజ పరిశీలించారు.

తగ్గిన యాసంగి సాగు

- గతేడాది 43 వేల ఎకరాల్లో పంటలు.. ఈసారి 30 వేల ఎకరాల్లోపే..
- గత సీజన్‌కంటే 30 శాతం తక్కువ
- అప్పుడే మండుతున్న ఎండలు.. ఆపై కరెంట్ కోతలు
- కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి విడుదల కాని నీరు


కుమ్రం భీం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కాక కాలువలో పెరిగిన గడ్డి

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొన్నేళ్లుగా పెరుగుతూ వచ్చిన యాసంగి సాగు, ఈయేడాది తగ్గుముఖం పట్టింది. గతేడాది ఇదే సీజన్‌లో దాదాపు 43 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయగా, ఈసారి 30 వేల ఎకరాల్లోపే సాగైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. 40 వేల ఎకరాల్లో సాగు ఉంటుందని అధికారులు భావించినప్పటికీ, 30 వేల ఎకరాల్లోపే పంటలు వేస్తున్నట్లు తెలుస్తున్నది. కేసీఆర్ సర్కారులో 24 గంటల ఉచిత విద్యుత్, సాగు నీటి వనరులతో దర్జాగా పంటలు తీసిన రైతాంగం, ఈసారి మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయానికి అనధికారిక విద్యుత్ కోతలు మొదలు కాగా, కరంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందోనన్న భయం రైతులను వెంటాడుతుంది. దీనికి తోడు జిల్లాలో ప్రధాన సాగునీటి జలాశయమైన కుమ్రం భీం ప్రాజెక్టులో 10 టీఎంసీల నీటి నిల్వకు బదులుగా 5 టీఎంసీలనే ఉంచడం, కాలువల ద్వారా ఇంకా నీటిని విడుదల చేయకపోవడంతో యాసంగి సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు.

వరి సాగుతో పాటు..

సాధారణంగా ఈ సీజన్‌లో ప్రధానంగా వరి సాగు ఎక్కువగా ఉంటుంది. తర్వాత జొన్న, మక్క, పప్పు దినుసులువంటివి పండిస్తారు. గత యాసంగిలో 18 వేల ఎకరాల్లో వరి వేయగా, ఈ ఏడాది 4,500 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. గతేడాది 7,881 ఎకరాల్లో శనగ వేయగా, ఈసారి 4,600 ఎకరాల్లో సాగవుతోంది. గతేడాది 2,148 ఎకరాల్లో పెసర సాగు కాగా, ఈ ఏడాది 425 ఎకరాల్లో మాత్రమే వేశారు. జొన్న, మక్క పంటలు కూడా గతేడాదితో పోలిస్తే ఈ సారి సగానికి పైగా తగ్గినట్లు తెలుస్తోంది. దాదాపు 30 శాతం వరకు తగ్గినట్లు తెలుస్తున్నది. ఇక బోర్లు ఉన్న రైతులు ఫిబ్రవరి చివరి వరకు కూడా జొన్న, మక్క టమాట, బెండ, బీరవంటివి సాగు వేస్తుంటారు. మూడు నెలల్లోనే ఈ పంటలు చేతికి వస్తాయి. అయితే.. ఈ ఏడాది ఎండలు కూడా ముందే పెరగడం, విద్యుత్ కోతలు మొదలవ్వడంతో ఆ పంటల సాగులోనూ వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. గతంలో కుమ్రం భీం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేసేవారు. కాలువల్లో పైపులు వేసి ఆయిల్ ఇంజన్‌ల ద్వారా పంటలకు నీరు మళ్లించుకునేవారు. ఈసారి పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో ఆయిల్ ఇంజన్‌ల ద్వారా కూడా రైతులు నీరు పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

కొత్త చైర్మన్ X పాత కమిషనర్

- తనపై ఫిర్యాదు చేసినోళ్లని పిలిపించాలంటూ బాలకృష్ణ పట్టు
- ఇది పంచాయితీలు చేసే అడ్డా కాదని స్పష్టం చేసిన ఉప్పలయ్య

మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌తో మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

మంచిర్యాల, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపాలిటీలో గతంలో కమిషనర్‌గా పనిచేసిన బాలకృష్ణపై అవినీతి ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇంటి నిర్మాణ అనుమతుల కోసం కమిషనర్ రూ.15 లక్షలు తీసుకున్నాడంటూ అమరగాని రమేశ్ యాదవ్ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్.. కమిషనర్‌పై వస్తున్న ఆరోపణలపై విజిలెన్స్‌కు లేఖ రాస్తానని, డబ్బులు తీసుకున్న అటెండర్ విషయంలో నూ విచారణ చేయాలని ప్రస్తుతం ఉన్న కమిషనర్‌ను ఆదేశిస్తామని చెప్పారు. కాగా, తనపై ఆరోపణలు వచ్చిన విషయం తెలుసుకున్న పాత కమిషనర్ బాలకృష్ణ గురువారం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికీ చైర్మన్ రాకపోవడంతో దాదాపు గంటపాటు ఎదురుచూశారు. చైర్మన్ వచ్చాక.. అవిశ్వాస తీర్మాన సమయంలో రోజూ సలహాలు తీసుకునేందుకు ఫోన్ చేసిన మీరు, ఎవరో వచ్చి నాకు రూ.15 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదు చేస్తే ఎలా తీసుకున్నారంటూ కమిషనర్ బాలకృష్ణ ప్రశ్నించారు. ఒక్కమాట తన దృష్టికి తీసుకువస్తే అప్పుడే ఏదో ఒక క్లారిఫికేషన్ ఇచ్చేవాడినని, అలా చేయకుండా మీడియా వాళ్లకు చెప్పేంత పెద్ద విషయం ఏముందో చెప్పాలని కోరారు. నేను కూడా వాళ్లకో రూ.5 లక్షలు, వీళ్లకో రూ.3 లక్షలు ఇచ్చానని ఫిర్యాదు చేస్తే.. ఇలాగే చేస్తారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎవరు ఫిర్యాదు చేశారో కానీ.. తనకు ఎండార్స్ చేసి ఇవ్వాలని, అలాగే ఆరోపణలు చేసిన వారిని పిలిపించి రుజువు చేయించాలని కమిషనర్ పట్టుబట్టారు. రుజువు చేస్తే ఇప్పుడే రూ.15 లక్షలు ఇచ్చి వెళ్తానని చెప్పగా, దీనిపై చైర్మన్ ఉప్పలయ్య స్పందిస్తూ ఎవరు ఫిర్యాదు చేసినా దాన్ని కమిషనర్‌కు ఫార్వర్డ్ చేయడం తప్ప.. తాను చేసేదేమీ లేదన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే అడగండి.. అంతేకానీ ఫిర్యాదు ఇచ్చిన వారికి పిలిచి మాట్లాడేందుకు ఇది పంచాయతీల అడ్డా కాదని.. మున్సిపల్ కార్యాలయమని చెప్పారు. మీకు ఫోన్ చేసి ఫిర్యాదు వచ్చిందని చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఇలా అడిగే అధికారం మీకు లేదని, మీకు ఏదైనా సమాచారం కావాలంటే లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వండి ఇస్తామని చెప్పారు. కాసేపటికి చైర్మన్ గదిలో నుంచి అందరిని పంపించి బాలకృష్ణకు ఫిర్యాదు కాపీని అందజేశారు. దీనిపై కమిషనర్ బాలకృష్ణ స్పందిస్తూస్పందిస్తూ.. ఈ విషయంపై న్యాయపరంగా పోరాడుతానని చెప్పి వెళ్లిపోయారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

ఖమాన గ్రామస్తుల డిమాండ్

కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం

ఎడ్లబండ్లు అడ్డుపెట్టి..ముండ్ల కంపలు వేసి ధర్నా

వాంకిడి, ఫిబ్రవరి 29 : రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఖమాన గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. రోడ్డుకు అడ్డంగా ఎడ్లబండ్లు, ముండ్ల కంపలు వేసి ధర్నా చేశారు. వాంకిడి మండల కేంద్రంలో ఖమాన అండర్ పాస్ బ్రిడ్జి నుంచి ఖమాన గ్రామం వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని, రెండేళ్ల క్రితం రోడ్డు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇప్పటికీ పూర్తి చేయలేదని మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో ఫోన్ చేయించినా.. రేపు.. మాపు అంటూ కాలయప చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డంతా తవ్వి.. కంకర పోయడం వల్ల వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయని, ఇప్పటికే పలువురు గాయపడ్డారని చెప్పుకొచ్చారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్, వాంకిడి సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని ఐదు రోజుల్లో రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

వాంకిడి :ఖమాన గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

ఇద్దరికి షోకాజ్ నోటీసులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 29: అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్‌లో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ వర్కర్ ఇర్ఫాన్ ఇంటి నంబర్లు ఇప్పిస్తానని చెప్పి ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 15 వేల చొప్పున మొత్తం రూ. 45 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఫక్రూ అలీ అనే అటెండర్ ఇంటి అనుమతులు ఇప్పిస్తానని ఒకరి వద్ద రూ. 25 వేలు, మరొకరి దగ్గర రూ. 5 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదుల అందాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వాస్తవంకాదు

రాంనగర్‌లోని అమరవేణ రమేశ్‌యాదవ్ దగ్గర రూ. 5 లక్షలు వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని మున్సిపల్ అటెండర్ ఫక్రూఅలీ తెలిపారు. ఈ మేరకు ఇంటి యజమాని అమరవేణి ఐలయ్యను గురువారం మున్సిపల్ కార్యాలయానికి తీసుకువచ్చి చైర్మన్‌కు, కమిషనర్‌కు కలిపించాడు. తాను ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని, తన ఇంటిపై కొడుకుకు ఎలాంటి అధికారం లేదని అన్నారు.

ఎవరికీ డబ్బు లివ్వలేదని చైర్మన్‌కు చెబుతున్న ఐలయ్య

వన్‌టైమ్ సెటిల్ చేస్తే 90 శాతం వడ్డీమాఫీ

మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

ఆస్తి పన్ను బకాయిదారులకు ఊరట

వసూళ్లకు మిగిలింది నెలరోజులే

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 29 : ఆస్తిపన్ను బకాయిదారులకు సర్కారు శుభవార్త చెప్పింది. 2023 వరకు మున్సిపాలిటీలకు చెల్లించాల్సిన ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీని 90 శాతం మాఫీచేస్తూ నిర్ణయం తీసుకుంది. పాతబకాయిలన్నీ ఒకేసారి చెల్లిస్తేనే.. ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఈ నిర్ణయంతో 2023 మార్చి వరకు ఉన్న ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీని కేవలం 10 శాతం మాత్రమే చెల్లిస్తే చాలు. ఇప్పటికే బకాయిలపై వడ్డీ మొత్తం చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో విధించే ఆస్తిపన్నులో 90 శాతం వడ్డీ మొత్తాన్ని రాయితీగా అందించనున్నది. దీంతో మున్సిపాలిటీలకు బకాయిపడ్డ చాలా మంది భవన యజమానులకు కాస్త ఊరట లభించనున్నది. మంచిర్యాల మున్సిపాలిటీలో పాత బకాయిలు రూ. 4.16 కోట్లు ఉండగా, దానిపై వడ్డీ రూ. 2.79 కోట్లు ఉన్నది.

మిగిలింది నెలరోజులే

ఆస్తిపన్ను వసూలుకు కేవలం నెలరోజులే మిగిలి ఉంది. ఇప్పటివరకు కేవలం 46.92 శాతం ఆస్తిపన్ను మాత్రమే వసూలు చేశారు. మంచిర్యాలలో 26718 భవనాలు ఉండగా, వాటిలో 1665 మిక్స్‌డ్ (నివాస, వాణిజ్య), 1397 నాన్ రెసిడెన్స్. 23656 నివాస భవనాలు ఉన్నాయి. వీటిద్వారా ఈ ఏడాదికి సంబంధించి ఆస్తిపన్నురూ. 10.62 కోట్లు రావాల్సి ఉంది. ఈ ఏడాదికి సంబంధించి జరిమానా రూపేణా రూ. 51.62 లక్షలు, పాత బకాయిలు రూ. 4.16 కోట్లు, పాతబకాయిలపై వడ్డీ రూ. 2.79 కోట్లు కలిపి మొత్తం రూ. 18.09 కోట్లు వసూలు చేయడం లక్ష్యంగా ఉంది. ఇందులోనుంచి ఇప్పటివరకు ప్రస్తుత సంవత్సర ఆస్తిపన్ను రూ. 6.79 కోట్లు, ప్రస్తుత ఏడాది పన్నుపై వడ్డీ రూ. 14.2 లక్షలు, పాతబకాయిలు రూ. 1.15కోట్లు, పాతబకాయిలపై వడ్డీ రూ. 40.43 లక్షలు కలిపి మొత్తం రూ. 8.49 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ. 9.60 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

వసూళ్ల కోసం స్పెషల్‌డ్రైవ్

మంచిర్యాల మున్సిపాలిటీలో ఆస్తిపన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ఆస్తిపన్ను వసూళ్ల కోసం అన్ని వార్డులకు సిబ్బందిని నియమించారు. ఉదయం ఏడుగంటలనుంచి సాయం త్రం ఆరుగంటల దాకా పన్ను వసూళ్లు చేపడుతున్నారు. ఆటోలు, కేబుల్ టీవీల్లో పన్నులు చెల్లించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. లక్షకు పైగా ఆస్తిపన్ను కట్టాల్సి ఉన్న 100 మంది భవన యజమానుల లిస్టును తయారు చేశారు. వీరికి ప్రతిరోజూ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యతోపాటు కమిషనర్ మారుతీప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ప్రత్యేకంగా ఫోన్లు చేస్తున్నారు. పన్ను చెల్లించాలని కోరుతున్నారు. మొండి బకాయిదారులను గుర్తించి.. రెడ్ నోటీసులు అందించారు. పన్ను చెల్లించకుంటే ఇళ్లల్లోకి వచ్చి విలువైన వస్తువులు జప్తు చేస్తామని చెబుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎస్పీ సురేశ్‌కుమార్ • పోలీస్ సాయుధ బలగాలకు వాలీబాల్ టోర్నీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29 : నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలు నిర్వహించడం వల్ల మానసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు సాయుధ బలగాలకు వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని క్రీడలు దోహదపడుతాయని చెప్పారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, సీఐ సతీశ్, ఆర్ఐ ఎంటీ అంజన్న, ఆర్ఐ స్పెషల్ పార్టీ షేక్ నాగుల్ మేర, సీఐ శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆర్టీసీ ఆదాయం రూ. 3.41కోట్లు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 29 : మేడారం జాతర.. ఆర్టీసీకి భారీగా ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. ఫిబ్రవరి 18వ నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు బస్ డిపోలనుంచి మేడారానికి 342 బస్సులు నడుపగా, ఆర్టీసీకి రూ. 3,41,51,898 ఆదాయం సమకూరింది. మొత్తం 6,13,739 కిలోమీటర్లు నడిచిన ఆర్టీసీ బస్సులు కిలోమీటరుకు రూ. 55.65 ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. 59 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచిన బస్సుల్లో మొత్తం 72,108 మంది ప్రయాణించగా అందులో 39,024 మంది మహాలక్ష్మి పథకం కింద ప్రయాణించారు. 33,084 మంది చార్జీలు చెల్లించి ప్రయాణాలు సాగించారు. ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్ డిపోనుంచి 65 బస్సులు, భైంసా డిపోనుంచి 40 బస్సులు, నిర్మల్ డిపోనుంచి 58 బస్సులు, ఆసిఫాబాద్ డిపోనుంచి 72 బస్సులు, మంచిర్యాల డిపోనుంచి 107 బస్సులు నడిపించారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు

వెంచపల్లి సమీపంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న సీపీ

కోటపల్లి, ఫిబ్రవరి 29 : మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వెంచపల్లి గ్రామ సమీపంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలోగల ఫెర్రి పాయింట్స్, పోలీస్‌స్టేషన్స్‌ను గురువారం సందర్శించారు. సీపీ మాట్లాడుతూ జన జీవన స్రవంతిలో కలిసి కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండాలనుకునేవారికి ప్రభుత్వం తరపున వచ్చే లాభాలన్నీ అందేలా చూస్తామన్నారు. అజ్ఞాతంలో ఉండి సాధించేదేదీ లేదని, లొంగిపోతే పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అభివృద్ధికి ఆటంకంగా నిలిచేవారిని నిలువరించేందుకు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో డ్రోన్ ద్వారా పహారా కాస్తున్నామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంచపల్లి వద్ద పడవలు నడుపుకునేవారు, చేపలు పట్టేవారితో మాట్లాడిన సీపీ సరిహద్దుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకెన్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు , చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, చెన్నూర్ సీఐ రవీందర్, కోటపల్లి, నీల్వాయి ఎస్ఐలు మహేందర్, సుబ్బారావు పాల్గొన్నారు

సంఘ విద్రోహ శక్తులకు సహకరించవద్దు

వేమనపల్లి, ఫిబ్రవరి 29 : సంఘ విద్రోహ శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం సీపీ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్‌తో కలిసి సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలన్నారు. నీల్వాయిలో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, చెన్నూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్, నీల్వాయి, కోటపల్లి ఎస్ఐలు సుబ్బారావు, రవీందర్ ఉన్నారు.

ఆకాశమే హద్దుగా ఎదగాలి : డీఈవో అశోక్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 29: ప్రత్యేకావసరాలుగల పిల్లలు ఆకాశమే హద్దుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిసేబులిటీస్ ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాలు గల విద్యార్థులకు గురువారం సామగ్రి కిట్లు అందజేశారు. డీఈవో మాట్లాడుతూ సామగ్రి వినియోగింగంపై విలీన విద్య రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇస్తారన్నారు. ఒక్కో కిట్టు విలువ సుమారు రూ. 10 వేలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐపీ ఐడీ ప్రతినిధి శ్యామ్, విలీన విద్య కో ఆర్డినేటర్లు కటకం మధుకర్, అబిద్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిట్లు అందజేస్తున్న డీఈవో అశోక్

ఉమ్మడి జిల్లాలో 1295 డీఎస్సీ ఖాళీలు

మంచిర్యాల, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1295 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది. ఆదిలాబాద్ జిల్లాలో 324, ఆసిఫాబాద్‌లో 341, మంచిర్యాలలో 288, నిర్మల్ 342 పోస్టులను భర్తీ చేయనున్నది. జిల్లాల వారీగా డీఎస్సీ ఖాళీల భర్తీ వివరాలు ఇలా..

పోస్టులు	ఆదిలాబాద్	మంచిర్యాల	నిర్మల్	ఆసిఫాబాద్
స్కూల్ అసిస్టెంట్ పోస్టులు	74	70	70	62
ల్యాంగ్వేజ్ పండిత్‌లు	14	16	4	25
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు	2	3	4	2
సెకండరీ గ్రేడ్ టీచర్లు	209	176	236	234
స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేటర్స్)	6	5	5	3
సెకండరీ గ్రేడ్ టీచర్(స్పెషల్ ఎడ్యుకేటర్స్)	19	18	23	15
మొత్తం	324	288	342	341

వైస్ ఎంపీపీ ఎన్నికకు హాజరు కానీ ఎంపీటీసీలు

హాజరు కానీ ఎంపీటీసీలు

భీమారం, ఫిబ్రవరి 29 : వైస్ ఎంపీపీ ఎన్నికను అధికారులు గురువారం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు అనుసారం రెండు రోజులు నిర్వహించాల్సి ఉండగా మొదటి రోజు ఎన్నికల అధికారి చిన్నయ్య , ఎంపీటీసీ భీమారం (1) సరోజన హాజరు కాలేదు. భీమారం ఎంపీపీ (2) చెరకు దీపికారెడ్డితో పాటు, భూజీపల్లి ఎంపీటీసీ పెద్దల రూప హాజరయ్యారు. దీంతో బుధవారం ఎన్నిక జరగలేదు. రెండో రోజు ముగ్గురు ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో కోరం లేక వైస్ ఎంపీపీ ఎన్నిక జరగలేదని ఎన్నికల అధికారి చిన్నయ్య తెలిపారు. ఎలక్షన్ కమిషన్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాథోడ్, సూపరింటెండెంట్ విజయ్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు రైల్వే గేటు మూసివేత

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 29 : సిర్పూర్(టీ)–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోగల వేంపల్లి గ్రామ సమీపంలోని రైల్వే గేటును మరమ్మతుల కోసం 12 గంటల పాటు మూసివేస్తున్నట్లు సిర్పూర్(టీ) ఎస్ఐ దికోండ రమేశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ రాత్రి 8 గంటల నుంచి 2న ఉదయం 8 గంటల వరకు రైల్వే గేటును అధికారులు మూసి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వాహనదారులు, ప్రయాణికులు గమనించి పెద్దబండ వయా చింతకుంట నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లాలని సూచించారు.

అధునాతన యంత్రాలు వినియోగించాలి

- సీఎండీ బలరామ్‌నాయక్

రామగిరి ఫిబ్రవరి 29: సింగరేణిలో ఆధునాతన యంత్రాలను వినియోగించి బొ గ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని చైర్మ న్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్‌నాయక్ సూచించారు. గురువారం ఆయన ఆర్జీ–3, ఏపీఏ ఏరియా ఓసీపీ –2 ఉపరితల గనిలో రూ. 24 కోట్లతో కొనుగో లు చేసిన రెండు ప్రైమరీ కోల్ సైజర్స్ యంత్రాలు, ఏల్పిలో 3 సీమ్ డెవలప్‌మెంట్ కోసం పంచ్ ఎంట్రీల పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణిలో అతిపెద్ద భూగర్భగని అడ్రియాల లాంగ్‌వాల్, ఉపరితల గను ల్లో ఆధునిక యంత్రాలను వినియోగించాలని కోరారు. కార్మికులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆయన కోరారు.